క్లుప్తంగా

తాళంబేడులో పశువైద్య శిబిరం



పశువులకు మందులు స్ప్రే చేస్తున్న సిబ్బంది

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం తాళంబేడు గ్రామంలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యక్షేత్ర సహాయకులు సురేష్ పశువులకు పిడుదుల నివారణ, నట్టల నివారణ మందులు స్ప్రే చేయించారు. పశువుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో 110 పశువులు, 40 దూడలకు నట్టల నివారణ మందులు, 25 పశువులకు చూడి పరీక్షలు, 167 పశువులకు పిడుదుల మందు స్ప్రే చేసినట్లు సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

తప్పులు లేకుండా సర్వే చేయండి



తనిఖీ చేస్తున్న జిల్లా క్షయ నివారణ అధికారి

యాదమరి (కాణిపాకం): తప్పులు లేకుండా కుష్ఠు సర్వే చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ ఆదేశించారు. యాదమరి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. లెప్రసీ సర్వే వివరాలపై ఆరా తీశారు. సర్వే రికార్డులను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జాన్ తదితరులున్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లు

గుడిపాల: పశువైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి సాయిసుధ తెలిపారు. బుచ్చన్నకండ్రిగ గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 208 పాడి ఆవులకు వైద్యశిబిరం నిర్వహించారు. గర్భకోశ వ్యాధులకు చికిత్స చేయడంతోపాటు డీవార్మింగ్ మందులు అందజేశారు. లంపీస్కిన్ వ్యాధి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పశువులకు ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే పశు సహాయకులను సంప్రదించాలన్నారు.

పైనేని మునెమ్మ స్మారక కథల పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : పైనేని మునెమ్మ స్మారక జాతీయ స్థాయి కథల పోటీలు నిర్వహించనున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు పైనేని తులసీనాథంనాయుడు, పుష్ప తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. పైనేని మునెమ్మ స్మారక పురస్కారాలకు జాతీయ స్థాయి కథల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు కుటుంబ సమస్యలు, సామాజిక సమస్యలను ఇతివృత్తంగా చేసుకుని కథలు రాయాలన్నారు. తెల్లకాగితంపై చేతిరాతతో 10 పేజీలు మించకుండా, డీటీపీలో అయితే 4 పేజీలు మించకుండా కథలు పంపాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు తులసీనాథంనాయుడు, కళామందిరం, సాయిగార్డెన్ సిటీ, గంగవరం, పలమనేరు పేరుతో ఫిబ్రవరి 20 లోపు పంపాలని తెలిపారు. గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

సాయుధ శిక్షణ



శిక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది

చిత్తూరు అర్బన్: గురి చూసి కాల్చితే...బుల్లెట్ పాయింట్‌లోనే పడాలని అడిషనల్ ఎస్పీ శివానంద కిషోర్ అన్నారు. గంగాధరనెల్లూరు మండలంలోని ఫైరింగ్ రేంజ్ ప్రాంగణంలో బుధవారం సివిల్, సాయుధ దళ పోలీసులకు ఫైరింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ఇందులో ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో సాయుధ దళ పోలీసుల సేవలు చాలా కీలకమన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలు, ప్రభుత్వ, ధన, ప్రాణ రక్షణకు ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలన్నారు. సివిల్ పోలీసులు శాంతిభద్రతలను నిరంతరం పరిరక్షిస్తూ ఉండాలని సూచించారు. అనంతరం ఫైరింగ్‌పై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాషా, ఆర్ఐ సుధాకర్, భాస్కర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- దగ్గర పడుతున్న పదో తరగతి పరీక్షల సమయం
- విద్యార్థులకు ఇక మిగిలింది 46 రోజులే
- విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఉపాధ్యాయులు
- పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న వైనం
- శ్రద్ధగా పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

టెన్త్ టెన్షన్ ఆరంభం



తవణంపల్లె హైస్కూల్లో ప్రత్యేక తరగతి నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తవణంపల్లె: టెన్త్ పరీక్షలు దగ్గర పడుతుండడంతో విద్యార్థులతోపాటు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. ఇక 46 రోజులే గడువుండడంతో ప్రణాళిక ప్రకారం అభ్యసనం చేయాలంటూ విద్యార్థులకు సూచనలు చేస్తున్నారు. విద్యార్థి దశలో పదవ తరగతి అత్యంత కీలకం. పదవ తరగతి పరీక్షల్లో సాధించే మార్కులతోనే విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉంది. గత ఏడాది ఉత్తీర్ణత శాతాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ అప్రమత్తమైనది. ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి ముమ్మర కసరత్తు చేస్తున్నారు. పదో తరగతి పరీక్షలను మార్చి 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఉన్న సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలి. సాధనతో కీలక అంశాలు వెలుగులోకి వస్తాయని ఉపాధ్యాయులు పిల్లలకు సూచిస్తున్నారు. మండలంలో ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 251 మంది, 3 ప్రయివేటు హైస్కూళ్ల నుంచి 203 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

పాఠ్యాంశాలపై అవగాహన అవసరం

ప్రభుత్వం పరీక్షల తేదీలు ప్రకటించడంతో విద్యార్థుల్లో కొంత ఆందోళన మొదలైనది. పరీక్షలకు కేవలం 46 రోజులు మాత్రమే ఉంది. పరీక్షల సమయం దగ్గర పడడంతో ఇప్పటి నుంచి స్పష్టమైన ప్రణాళికతో పదో తరగతిలో మంచి మార్కులు సాధించి గట్టెక్కవచ్చు. ఉపాధ్యాయుల సలహాలు పాటించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాలంటే పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోవడమే ప్రధాన లక్ష్యమని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు

పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థుల్లో టెన్షన్ నెలకొంది. సమయాన్ని వృథా చేయకుండా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక ప్రణాళికతో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన సాగిస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు. తరగతిలో వెనుకబడిన వారిని గుర్తించి సబ్జెక్టు వారీగా పాఠ్యాంశాలపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు.

విద్యార్థులు భయం వీడాలి



పదో తరగతి పరీక్షలంటే విద్యార్థులు భయం వీడాలి. ప్రతి సబ్జెక్టుపై అవగాహన పెంచుకోవాలి. పాఠ్యాంశాలను క్షుణ్ణంగా చదువుకుంటే సులభంగా ఉత్తీర్ణత సాధించవచ్చు. ఆంగ్లభాష, గణితంపై సాధన చేస్తే మంచి మార్కులు సాధించవచ్చు. ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సందేహాలను నివృత్తి చేసుకుంటే పదిలో గట్టెక్కడం సులభం.

– త్యాగరాజులు రెడ్డి, ఎంఈఓ, తవణంపల్లె

టెన్షన్ పడొద్దు



పదో తరగతి పరీక్షలు రాసేటప్పుడు విద్యార్థులు టెన్షన్ లేకుండా ప్రశాంతంగా రాయాలి. టెన్షన్ పడడం వల్ల తెలిసిన సమాధానాలు మరిచిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకొని ఆత్మస్థైర్యంతో వందకు వంద మార్కులు సాధించవచ్చు. పరీక్షలు సమీపించే కొద్దీ ప్రత్యేక దృష్టి సారించి విద్యాబోధన చేస్తున్నాం.

–దేవరాజులు రెడ్డి, హెచ్ఎం, తవణంపల్లె హైస్కూల్

ప్రతి సబ్జెక్టుపై సాధన చేస్తున్నా



పదో తరగతిలో వంద మార్కులు సాధించాలన్న లక్ష్యంతో ప్రతి సబ్జెక్టుపై సాధన చేస్తున్నాను. మా ఉపాధ్యాయులు సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. పరీక్షలంటే టెన్షన్ ఉన్నా పరీక్షలు బాగా రాయడానికి ప్రణాళికాబద్ధంగా చదువుతున్నా. సమయాన్ని వృథా చేయకుండా సబ్జెక్టుల వారీగా చదువుతున్నాను. మంచి మార్కులతో పాసవుతా.

– డి.మౌనిక, పదో తరగతి, తవణంపల్లె హైస్కూల్

ప్రత్యేక తరగతులతో సాధన



హైస్కూల్లో ప్రతి రోజు ప్రత్యేక తరగతుల్లో సాధన చేస్తున్నాను. ఉపాధ్యాయులు ప్రతి పాఠ్యాంశంపై అవగాహన కల్పిస్తున్నారు. మా సందేహాలు ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. దీంతో నాకు చదువుకోవడానికి సులభంగా ఉంది. ఇప్పటికే అన్ని పాఠ్యాంశాలు రివిజన్ చేస్తున్నాను. పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడమే నా లక్ష్యం.

–మనోజ్, పదో తరగతి, తవణంపల్లె హైస్కూల్

చిత్తూరు 6వ అదనపు జడ్జిగా బాబునాయక్

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని ఆరవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తిగా బి బాబు నాయక్ నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణాజిల్లా అవనిగడ్డలో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఈయనకు పదోన్నతి కల్పిస్తూ చిత్తూరుకు బదిలీ చేశారు.

అధునాతన పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: రైతులు అధునాతన పద్ధతులపై అవగాహన పెంచుకుని తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలని ఏఓ వరలక్ష్మి అన్నారు. మండలంలోని ఇరువారంపల్లె, ఐలవారిపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు అధునాతన పద్ధతులపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి పెట్టుబడులు తగ్గించుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు వాడాలని చెప్పారు. డ్రోన్‌ల ద్వారా పురుగు మందులు వాడటం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నేషనల్ పేస్ట్ సర్విలెన్స్ సిస్టం(ఎన్‌పీఎస్ఎస్) యాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏలు మురళీకృష్ణ, రెడ్డెప్ప, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై ప్రత్యేకశ్రద్ధ



భవిత కేంద్రంలోని పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రమహేష్

గుడిపాల: భవిత కేంద్రంలో ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ప్రాథమిక వైద్యాధికారి చంద్రమహేష్ తెలిపారు. నరహరిపేట హైస్కూల్‌లో ఉన్న భవిత కేంద్రంలోని పిల్లలకు బుధవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేకంగా భవిత కేంద్రాల్లో పిల్లలపై శ్రద్ధ తీసుకొని వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కంటి పరీక్షలు, పంటి పరీక్షలు చేశారు. పిల్లల ఎత్తుతో పాటు బరువును తనిఖీ చేశారు. పౌష్టికాహారం తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో వడ్డిస్తున్న రాగిజావను తప్పనిసరిగా తీసుకొనే విధంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఐఈఆర్‌టీ టీచర్లు వాణి, బబిత తదితరులు పాల్గొన్నారు.

పశువులకు మెరుగైన వైద్యసేవలు



పిడుదుల నివారణ మందు పిచికారీ చేస్తున్న పశువైద్యాధికారి

ఐరాల: పల్లెల్లోనే పశువులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు మద్దిపట్లపల్లె పశువైద్యాధికారి పిన కాపాణి తెలిపారు. మండలంలోని 45 కొత్తపల్లె, చిగరపల్లె, ఎగువకామినాయనపల్లె గ్రామాల్లో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం కోసం పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో పశువులు, జీవాల్లో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ఆర్బీకేలోని పశువైద్య సహాయకులను సంప్రదించి చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. పాడి రైతులకు పశుపోషణపై అవగాహన కల్పించారు. అనంతరం శిబిరాల్లో 142 ఆవులకు, 45 దూడలకు, 500 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు. 20 ఆవులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు చేశారు. 130 పశువులకు పిడుదల నివారణకు మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశలపై నీళ్లు చల్లొద్దు



కార్యక్రమంలో సత్యసాయి సంస్థల ప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు తల్లిదండ్రుల ఆశలపై నీళ్లు చల్లకూడదని శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు మధుసూదనం అన్నారు. సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం మిట్టూరులోని ఆర్‌కే డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్, నీరు, ఆహారం, సమయం వృథా చేయకూడదన్నారు. బాల వికాస్ జిల్లా సమన్వయకర్త శంకర్ మాట్లాడుతూ నేటి పౌరులే దేశానికి పునాది వంటి వారని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోటివేటర్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ అజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తైఅమావాస్య అభిషేకం



ఊరేగుతున్న స్వామి వారు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో బుధవారం తై అమావాస్యను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూలవిరాట్‌కు అభిషేకం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామిని పలురకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులతో స్వామిని తరించారు. ఈ కార్యక్రమానికి కాకర్లవారి పల్లెకు చెందిన పలువురు ఉభయదారులుగా వ్యవహరించారు.

పేటమిట్టలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

పూతలపట్టు(కాణిపాకం): పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో బుధవారం రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ, గ్రామీణ పశువైద్యశాలను కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రారంభించారు. రూ.2.30 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, రూ.35 లక్షలతో పశువైద్యశాలను నిర్మించినట్లు అమరరాజా సంస్థల అధినేత గల్లా రామచంద్రనాయుడు తెలిపారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు మంగళ విద్యాలయం వారికోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్, భూగర్భ గనులశాఖ ఇంజినీర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు



బండపల్లెలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న డాక్టర్

గుడిపాల: ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందజేస్తున్నట్లు వైద్యాధికారులు అనూష, చంద్రమహేష్ తెలిపారు. మండలంలోని బండపల్లె, శ్రీరంగంపల్లెలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి గ్రామానికి వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, మంచానికే పరిమితమైన రోగులకు ఇంటివద్దే వైద్యాన్ని అందజేస్తున్నామన్నారు. అనంతరం షుగర్, బీపీ, మోకాళ్లనొప్పులతో బాధపడుతున్న వారికి చికిత్సలు చేసి ఉచితంగా మందులు, మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్రశేఖర్, సంధ్య, కోకిల, శిరీషా, రెజ్వాన్, శివగామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలి



అపరిశుభ్రంగా ఉన్న వీధులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రెడ్డిబాబు, ఈఓపీఆర్‌డీ రాఘవేంద్రరాజు

తవణంపల్లె: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. మండలంలోని దిగువమోదలపల్లె కాలనీని బుధవారం సందర్శించారు. దిగువమోదలపల్లె కాలనీలోని వీధులను, డ్రైనేజీ కాలువలను ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ పరిశీలించారు. ఏపుగా పెరిగిన ముళ్లచెట్లతో అపరిశుభ్రంగా ఉన్న వీధులను పరిశీలించారు. డ్రైనేజీ కాలువను పరిశీలించారు. వెంటనే శానిటేషన్ పనులు చేపట్టి వీధులను శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి పి.రజనిని ఆదేశించారు. వీధి లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని, వీధుల్లో కరెంటు స్తంభాలు నాటించి కరెంటు సరఫరా చేయాలని గ్రామస్తులు ఎంపీడీఓకు విజ్ఞప్తి చేశారు. వారం రోజుల్లో శానిటేషన్ పనులు పూర్తి చేసి వీధిలైట్లు వెలిగించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈఓపీఆర్‌డీ రాఘవేంద్రరాజు, మాజీ సర్పంచ్ దేవరాజులు, సురేష్, బాబు, రామకృష్ణయ్య పాల్గొన్నారు.

అన్నిదానాల కన్నా రక్తదానమే మిన్న



రక్తదానం చేస్తున్న సిబ్బంది

గుడిపాల: అన్నిదానాల కన్నా రక్త దానమే మిన్న అని డాక్టర్లు సంధ్య, అమర్‌నాథ్ తెలిపారు. మండలంలోని చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాన్ని నూతనంగా చేపడుతున్న మోంటేకార్లో కంపెనీ వారు బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 50 మందికి పైగా రక్తదానాన్ని అందజేశారు. వైద్యులు మాట్లాడుతూ అన్నిదానాల కన్నా రక్తదానం ఎంతో గొప్పదన్నారు. మోంటో కార్లో కంపెనీ యాజమాన్యానికి ఇటువంటి ఆలోచన రావడం అభినందనీయం అన్నారు. ఈ రక్తం అత్యవసర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులు, చిన్న పిల్లలు, ప్రమాదం జరిగిన వాళ్లకి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్యామ్‌ముష్కల్ క్యూ, రమేష్‌చంద్ర, ప్రాజెక్ట్ మేనేజర్ ముఖేష్‌కుమార్, గోపాలక్రిష్ణ, ఈశ్వరరావు, వైద్యసిబ్బంది చంద్రశేఖర్, విజయ, జబసెల్వి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నియామకాలు

చిత్తూరు అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు అసెంబ్లీ నియోజవర్గ విభాగ అధ్యక్షులను నియమిస్తూ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనను విడుదల చేసింది. యూత్ విభాగం అధ్యక్షుడిగా మనోజ్‌రెడ్డి, మహిళ విభాగం – అంజలి రెడ్డి, రైతు విభాగం– క్రిష్టారెడ్డి, బీసీ విభాగం – త్యాగరాజులు, ఎస్సీ విభాగం– సరళామేరి, ఎస్టీ విభాగం – పట్టాభి, మైనారిటీ – మస్తాన్‌ఖాన్, క్రిస్టియన్ మైనారిటీ – రమేష్, విద్యార్థి – సీపీ విష్ణు, పంచాయతీరాజ్ – మొగిలిరెడ్డి, మున్సిపల్ – శిరీష్ కుమార్, ఆర్టీఐ – అప్జల్‌ఖాన్, వలంటీర్ – కరుణాకర్, గీవెన్స్ – ఉదయ్‌రెడ్డి, వన్నియ– రంజిత్‌బాబు, వైఎస్సార్‌టీయూసీ – వెంకటప్రసాద్, లీగల్ – చక్రవర్తి, కల్చరల్ – కౌజర్ జహన్, సోషల్‌మీడియా – రాజశేఖర్‌రెడ్డి, ఐటీ – శివప్రకాష్, దివ్యాంగులు – పాండురా జు, వైద్యం – వంశీ నందన్, పబ్లిసిటీ – గజపతి, ఇంటిలెక్చువల్స్ ఫోరం – ప్రేమ్‌కుమార్, బూత్‌కమిటీ –మధుబాబును నిమించినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది.

కాణిపాకం తరహాలో మొగిలి అభివృద్ధి



మొగిలి శివాలయం అభివృద్ధిపై చర్చిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

బంగారుపాళెం: కాణిపాకం వినాయక స్వామి ఆలయం తరహాలో మండలంలోని మొగిలి శివాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మండలంలోని మొగిలి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వారిని బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ దర్శించుకున్నారు. కలెక్టర్‌కు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదల ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికి మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవారి దర్శనం కల్పించారు. కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఉత్సవాల అనంతరం అభివృద్ధి పనులు

మొగిలి శివాలయం ఆవరణలో ఆలయ అభివృద్ధిపై కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే స్థానికులతో చర్చించారు. వారు మాట్లాడుతూ, వచ్చే నెలలో మొగిలి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయన్నారు. ఆ ఉత్సవాలు ముగిసిన తరువాత ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. దేవదాయశాఖ అధికారులతోనూ సంప్రదింపులు చేసి ఆలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. దశలవారీగా పనులు చేపట్టనున్నామని తెలిపారు. మొదటి దశలో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం చేపడతామన్నారు. క్యూలు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర పనులకు ప్రాధాన్యత కల్పించనున్నట్లు వివరించారు. కాణిపాక ఆలయ స్థపతి ద్వారా మొగిలి శివాలయ ఆధునీకరణ కోసం సంప్రదాయబద్ధంగా పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఇందుకోసం ఆలయ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని సర్వే చేసి పరిరక్షించాలని గ్రామస్తులు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. దేవరకొండ సమీపంలోని శివ పార్వతుల గోశాలను కలెక్టర్, ఎమ్మెల్యే సందర్శించారు.

జెడ్పీ హైస్కూల్‌కు ఆట స్థలం కేటాయింపు

మండలంలోని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాఠశాలకు క్రీడా మైదానం లేదని క్రీడా మైదానానికి స్థలం కేటాయించాలని కోరారు. దీంతో గ్రామ సమీపంలో గల 2.34 ఎకరాల స్థలాన్ని క్రీడా మైదానంకోసం కేటాయిస్తున్నట్లు తెలిపారు. క్రీడా మైదానం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందిస్తాం

మండలంలోని ఎగువరాగిమానుపెంట గ్రామానికి చెందిన వీరజవాన్ కార్తీక్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందిస్తామని ఎమ్మెల్యే మురళీ మోహన్ తెలిపారు. ప్రభుత్వం నుంచి రూ.కోటి ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ఆమోదించినట్లు తెలిపారు. వీరజవాన్ దశదిన కర్మలోపు 5 ఎకరాల భూమి, నగదు అందించనున్నట్లు తెలిపారు. పాఠశాలలో వీరజవాన్ కార్తీక్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. గ్రామంలో నివాసముంటున్న కాలనీకి కార్తీక్ పేరు పెట్టినట్లు వివరించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఆర్ఐ మధుసూదన్, నాయకులు జయప్రకాష్, జనార్దన్, కోదండయాదవ్, ధరణి, లోక, హేమ పాల్గొన్నారు.

రేపు పనులు ప్రారంభం

పలమనేరు: పట్టణంలోని శివాలయం రాజగోపురం పనులు 31న ప్రారంభించనున్నటు ఈఓ కమలాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.